నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మూసాపేట: కైత్లాపూర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు.

- కైత్లాపూర్, సఫ్దార్‌నగర్, యూసుఫ్‌నగర్, రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..
- కై త్లాపూర్ గ్రామం, రాఘవేంద్రనగర్‌కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు..
- కేపీహెచ్‌బీ 15వ ఫేజ్, కై త్లాపూర్ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. 'యాంటీ టుబాకో డే'ను పురస్కరించుకొని 'విన్ లైఫ్ త్రూ ఓవర్ కమింగ్ అడిక్షన్స్' అనే అంశంపై హోమియోపతి ఫిజీషియన్, కార్పొరేట్ ట్రైనర్, బ్రహ్మకుమారీస్ సంస్థ మెడికల్ వింగ్ యాక్టివ్ సభ్యురాలు డాక్టర్ బి.కె. శ్రీలత ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

పాలిటెక్నిక్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మనూ ప్రధాన క్యాంపస్‌లోని పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించినట్లు 'మనూ' పాలిటెక్నిక్ హైదరాబాద్ ప్రిన్సిపల్ డాక్టర్ మహ్మద్ యూసుఫ్‌ఖాన్ బుధవారం తెలిపారు. ఉర్దూ మీడియం నుంచి లేదా ఉర్దూను ఒక సబ్జెక్టుగా చదివిన విద్యార్థుల కోసం నాలుగు డిప్లొమో కోర్సులలో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పాలిటెక్నిక్‌లో డిప్లొమో ఇన్ సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమో ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, డిప్లొమో ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, డిప్లొమో ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి నాలుగు కోర్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఒక్కో కోర్సులో 60 సీట్లతో ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అడ్మిషన్ల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులను సమర్పించాలని, ప్రాస్పెక్టస్, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ నందు అందుబాటులో ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 9848171044లో సంప్రదించాలన్నారు.

వడ్డేపల్లి నర్సింగ్‌రావు స్ఫూర్తితో ముందుకెళ్లాలి



వడ్డేపల్లి నర్సింగ్‌రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వడ్డేపల్లి నర్సింగ్‌రావు వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందనగర్ డివిజన్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నర్సింగ్‌రావు తనయుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ... కూకట్‌పల్లి నియోజకవర్గంలో నర్సింగ్‌రావు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి అమలు చేశారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో మనం అందరం ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

జూన్ 2 వరకు వీసీలను నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల్లో ఖాళీ అయిన వీసీ పదవులను జూన్ 2 వరకు కొత్త వారిని నియమించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగేశ్వర్‌రావు, సుమంత్ మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ తరహా సీఎం రేవంత్‌రెడ్డి కూడా విద్యశాఖను నిర్వీర్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచిన ఇంత వరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం దారుణమన్నారు. విద్యాసంవత్సరం ఆరంభంలో పాఠశాలు, కళాశాలలు, యూనివర్సిటీలలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు, పరీక్షలు, ఫలితాలు, వివిధ రకాల ఫీజుల నిర్ణయాలు తదితర కీలక సమయంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఇలాంటి తరుణంలో రాష్ట్రంలోని పది వర్సిటీలకు పర్మనెంట్ వీసీలను నియమించకుండా వివిధ శాఖల విధులతో నిత్యం తీరిక లేకుండా గడిపే ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జి వీసీలుగా నియమిస్తే కార్యక్రమాల్లో జాప్యం జరిగి విద్యార్థులు నష్టపోతారన్నారు. ఈ సమావేశంలో స్వాతి, ప్రశాంత్, సంతోష్, కార్తీక్, మధు, సురేఖ, ప్రవీణ్, మహేష్, శ్రీకాంత్, బాలు పాల్గొన్నారు.

ఓయూకు మాల ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూకు మాల కులానికి చెందిన ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలని ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ (అంసా) అధ్యక్షులు నామ సైదులు డిమాండ్ చేశారు. నిజాం నవాబ్ పాలనలో విద్యాశాఖ మంత్రిగా పని చేసిన మాలకులానికి చెందిన భాగ్యరెడ్డివర్మ 136వ జయంతిని బుధవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. భాగ్యరెడ్డివర్మ విద్యావ్యాప్తిగా చేసిన కృషి మరువలేనిదని అన్ని సామాజిక వర్గాలతో కలిసి చేసే తత్వం గల మాలలకు ఓయూ వీసీ పదవీ ఇవ్వాలన్నారు. తెలంగాణ మాల మహానాడుతో పాటు ఇతర మాల సంఘాల మద్దతుతో గత అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ పార్టీ ఓయూకు మాల ప్రొఫెసర్‌ను వీసీగా నియమిస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. వివిధ విద్యార్థి సంఘాల నాయకులు ఎస్ఎం శ్రీకాంత్‌యాదవ్, ఉదయ్, గోపి, బసవరాజు, శ్రీను, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో పోటీ చేస్తాం

ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ

పంజగుట్ట: ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను నిలబెట్టేందుకు కృషి చేస్తామని పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు సింగం శ్రీనివాస్ రావు పార్టీలో చేరగా ఆయనను పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయలక్ష్మి, ఉపాధ్యక్షుడు దశరథం, నామిని భాస్కర్, లక్ష్మి, పుష్పాంజలి, నవీన్, రమేష్, పావని, శారద, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొడ్ల వెంకటేష్‌గౌడ్ జన్మదిన వేడుకలు



గోదాకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో రంజిత్‌రెడ్డి సమక్షంలో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండలోని గోదాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, ఆయన సోదరుడు నరేంద్రరెడ్డి హాజరై వెంకటేష్‌గౌడ్‌తో కేక్ కట్ చేయించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గజమాలతో సన్మానించి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ సయ్యద్, షౌకత్‌అలీ మున్నా, ఫారూఖ్, ఖలీమ్, బషీర్, షఫీ,అజామ్, సత్తార్, ఇమ్రాన్, ఖాజా, మహమ్మద్ గౌస్, ఫిరోజ్, షబ్బీర్, యాకుబ్, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిళ్ల అందజేత...

శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం నిర్వహించి తలసీమియా వ్యాధిగ్రస్తులకు రక్తాన్ని అందజేశారు.



గుర్రంపై కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మైనార్టీ నాయకులు



దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేసిన జగదీశ్వర్‌గౌడ్‌తో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ

- పాఠ్య పుస్తకాల్లో ఆయన జీవిత చరిత్రని చేర్చాలి
- ట్యాంక్‌బండ్‌పై కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్
- కర్క నాగరాజు ఆధ్వర్యంలో భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు

మూసాపేట: గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కర్క నాగరాజు ఆధ్వర్యంలో భాగ్యరెడ్డి వర్మ జయంతిని బుధవారం నిర్వహించారు. మూసాపేట డివిజన్ అంబేడ్కర్‌నగర్, గూడ్స్‌షెడ్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాదారం వినయకుమార్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వర్మ దళిత సమాజానికి ఎంతో సేవ చేశారన్నారు. దళిత వైతాళికుడిగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ 22 మే 1888న జన్మించి సంఘ సంస్కర్తగా, ఆది ఆంధ్ర సభ స్థాపించి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు.

నిజాం కాలంలోనే 26 బాలికల పాఠశాలలను స్థాపించారు

- అప్పటి హైదరాబాద్ సంస్థానంలో 1906-33 మధ్య 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశారన్నారు. ఆది హిందూ సర్వీసెస్ సంస్థను స్థాపించి మూఢాచారాలు, మద్యపానం, మూఢ నమ్మకాలపై ప్రజల్లో అవగాహన కల్పించారన్నారు. ఆయన సేవలను గుర్తించి నిజాం ప్రభుత్వం 26 పాఠశాలల్లో తెలుగు భాషను ప్రవేశపెట్టారన్నారు. నగరంలోని చాదరఘాట్‌లో 'ఆది హిందూ భవన్'ను నిర్మించి బాలికల విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు.
- తెలంగాణ ప్రభుత్వం ఆయన జీవిత చరిత్రని పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని, ట్యాంక్‌బండ్ వద్ద కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళిత నాయకులు కర్క పెంటయ్య, కర్క డాకయ్య, శారదరెడ్డి, బాశెట్టి నర్సింగరావు, కర్క శివశంకర్, మేకల రమేష్, పవన్, గంగారం, పెంటయ్య, శ్రీకాంత్‌యాదవ్, అప్పలరాజు, వెంకన్న, పాషా, జగన్, కర్క మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



గూడ్స్ షెడ్ రోడ్డులో భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కర్క నాగరాజు, వినయకుమార్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో

నాణ్యమైన విద్య



ప్రారంభమైన అడ్మిషన్ల ప్రక్రియ

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరం అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఈ ఏడాది కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియను ఈనెల మొదటి వారంలో ఆరంభించారు. ఏ ఫీజు లేకుండా అడ్మిషన్లు ఇస్తున్నారు.

కళాశాలలోని కోర్సులు

- సీఈసీ, ఎంపీసీ, బైపీసీ కోర్సులను తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో నిర్వహిస్తున్నారు.
- కంప్యూటర్‌సైన్స్‌లో ఒకేషనల్ కోర్సు కూడా అందుబాటులో ఉంది
- కళాశాలలో చేరే విద్యార్థులకు ఉచితంగా టెక్ట్స్ బుక్‌లు ఇస్తారు
- అర్హులైన ఎస్సీ,ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తారు
- అర్హులైన వారందరికీ బస్ పాస్ సౌకర్యం
- లైబ్రరీ, ల్యాబ్ సౌకర్యాలున్నాయి

నాణ్యమైన విద్య అందించేందుకు కృషి



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం. ఏటేటా విద్యార్థుల చేరిక గణనీయంగా పెరుగుతోంది. పదవ తరగతిలో మంచి ఫలితాలు వచ్చాయి. ఈ సారి విద్యార్థుల సంఖ్య 1000కు చేరవచ్చు.

-శ్రీనివాసులు, ప్రిన్సిపల్, రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల

పాలిసెట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి లేదు



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం

- రేపు పాలిసెట్-24 ప్రవేశపరీక్ష
- శేరిలింగంపల్లి జోన్ పరిధిలో అయిదు పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 1085 మంది విద్యార్థులు

రాయదుర్గం: పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష శుక్రవారం (మే 24వ తేదీ) నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లను పాలిసెట్-24 రీజనల్ కోఆర్డినేటర్ షేక్ ఎక్బాల్ హుస్సేన్ రీజనల్ పరిధిలోని గచ్చిబౌలి, రాయదుర్గం, మధురానగర్, నార్సింగి, మణికొండ ప్రాంతాలలో ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు. విద్యార్థులు ప్రవేశ పరీక్షా కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని సూచించారు. ఒకరోజు ముందు గానే తమ వెంబడి వచ్చే వారు పరీక్షా కేంద్రాన్ని గుర్తించేలా చేయడానికి చొరవ తీసుకోవాలని, లేదంటే యాప్‌ను ఉపయోగించి వెంటనే తెలుసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ పాలిసెట్‌లో అర్హత సాధించిన వారికి జీఐఎల్‌టీలోని కోర్సులలో చేరడానికి అడ్మిషన్లకు అవకాశం కల్పించడం జరుగుతుందని అధికారులు స్పష్టం చేశారు.

పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష వివరాలు..

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాలిసెట్-2024 ప్రవేశ పరీక్ష శుక్రవారం (మే 24వ తేదీ) నిర్వహిస్తారు.

- పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుంది
- శేరిలింగంపల్లి జోన్ పరిధిలో అయిదు ప్రవేశ పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు.
- ఒక్క నిమిషం (ఉదయం 11 గంటల తర్వాత) ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించకూడదని నిర్ణయించారు.
- విద్యార్థులను ఒక గంట ముందు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు
- గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకొనేలా ఏర్పాట్లు చేసుకోవాలి.

ప్రాంతం	పరీక్షా కేంద్రంపేరు	విద్యార్థుల సంఖ్య
రాయదుర్గం	గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లెదర్‌టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్	125 మంది
గచ్చిబౌలి	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	240 మంది
మధురానగర్	ప్రభుత్వ జూనియర్ కళాశాల	240 మంది
మణికొండ	జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల	240 మంది
నార్సింగి	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	240 మంది

పరీక్షా కేంద్రం లొకేషన్‌ను గుర్తించడానికి యాప్- ఎస్‌బీటీఈటీ టీఎస్ గూగుల్ ప్లేస్టోర్‌లో అందుబాటులో ఉంది

సమస్యలుంటే ఫోన్ చేయండి..

- విద్యార్థులకు సెంటర్ లోకేషన్, ప్రవేశ పరీక్షకు సంబంధించి ఇతర సమస్యలుంటే వెంటనే సెల్ నంబర్ 9912342053లో సంప్రదించాలి.
- పరీక్షా కేంద్రంలోకి అనుమతించేది ఇవే..
- పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను లోపలికి తీసుకెళ్ళనీయరు.
- ముఖ్యంగా సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్ వంటి వాటిని అనుమతించరు.
- బబ్లింగ్‌కు హెచ్‌బీ పెన్సిల్‌ను వినియోగించాలి. హాల్ టికెట్, పెన్, హెచ్‌బీ పెన్సిల్, షార్ప్‌నర్, ఎరేజర్‌ను మాత్రమే అనుమతిస్తారు.

ఏర్పాట్లు పూర్తి



శేరిలింగంపల్లి పరిధిలోని అయిదు సెంటర్లలో ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. స్వయంగా అయిదు కేంద్రాలను పరిశీలించి అన్ని సౌకర్యాలు ఉండేలా మాట్లాడాం. తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నాం. ఒక్కనిమిషం ఆలస్యమైనా కేంద్రం లోపలికి అనుమతించరాదని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పోలీసుల సహకారం కూడా తీసుకుంటున్నాం. సెంటర్లను కూడా సులభంగా గుర్తించే వాటినే ఎంపిక చేశాం. గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.

– షేక్ ఎక్బాల్ హుస్సేన్, రీజనల్ కోఆర్డినేటర్, జీఐఎల్‌టీ ప్రిన్సిపల్

వైభవంగా లక్ష్మీ నృసింహస్వామి కల్యాణం

కూకట్‌పల్లి: లీలాద్రిక్షేత్ర శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆల్విన్‌కాలనీ తులసీనగర్‌లోని లీలాద్రిక్షేత్రంలో త్రిదండి చిన జీయర్ స్వామివారి మంగళ శాసనములతో, శ్రీమాన్ శ్రీ చక్రవర్తుల శ్రీ వత్సచార్యుల ప్రత్యక్ష పర్యవేక్షణలో వేడుకలు జరుగుతున్నాయని ఆలయ ఫౌండర్, చైర్మన్ మాధవరం కాంతారావు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం శ్రీలక్ష్మీ నరసింహ జయంతిని పురస్కరించుకొని ఉదయం 8 గంటలకు నిత్యహోమం, పూర్ణాహుతి, ఉదయం 10 గంటలకు శ్రీ లక్ష్మీ నరసింహ కల్యాణం, సాయంత్రం 5 గంటలకు విష్ణు సహస్రనామ స్తోత్రం, భజన, ఆరాధన, స్వామి అమ్మవార్ల ఏకాంత సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

జీవవైవిధ్యం లేనిదే మానవ మనుగడ లేదు

ఎంపీడీఓ యాదగిరి

పటాన్‌చెరు టౌన్: జీవ వైవిధ్యం లేనిదే మానవ మనుగడ లేదని పటాన్‌చెరు ఎంపీడీఓ యాదగిరి అన్నారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవంను బుధవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ జీవ వైవిధ్య మండలి, పర్యావరణ పరిరక్షణ శిక్షణ సంస్థల సహకారంతో నిర్వహించారు. విద్యార్థులతో కలసి పటాన్‌చెరు పట్టణంలో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీడీఓ యాదగిరి జీవవైవిధ్యం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... పూర్వం చిరుధాన్యాల వాడకంతో ఆరోగ్యంగా ఉండేవారని తెలిపారు. కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ శ్రీహరిరెడ్డి జీవవైవిధ్య పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలను, చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా వాడటం వల్ల వచ్చే లాభాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, రంగోలి పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. ప్రతిభ కనబరించిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు.

ఖాళీ స్థలాలు.. అపరిశుభ్రతకు నిలయాలు

- కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న చెత్త, చెదారం
- ఓనర్ల నిర్లక్ష్యం.. పట్టించుకోని అధికారులు
- దోమల నిలయంతో ప్రబలుతున్న అనారోగ్య సమస్యలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: జనావాసాల్లో ఖాళీ స్థలాలు మురికి నీటితో గుంతలుగా మారి కంపు కొడుతున్నాయి. ఓనర్ల నిర్లక్ష్యం..అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రజలకు పాట్లు తప్పడం లేదు. వర్షాకాలం ముందే వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటీవల పెద్ద వానలు కురువగా...మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పలు పురపాలికల్లో వరద సమస్య కూడా ప్రారంభమైంది. దీంతో పురపాలికల్లోని ఖాళీ స్థలాలతో సంబంధిత కాలనీ వాసులు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఖాళీ స్థలాలు, ప్లాట్లల్లో ముళ్లపొదలు, చెదారం పేరుకు పోవటంతోపాటు మురుగు, వర్షం నీరు నిలిచి దోమలు విజృంభిస్తున్నాయి. అపరిశుభ్రత వెక్కిరిస్తోంది. పురపాలిక చట్టం ప్రకారం ఖాళీ స్థలాల్లో ఎలాంటి ముళ్ల పొదలు పెరగకుండా, అపరిశుభ్రత లేకుండా యజమానులు చూసుకోవాల్సి ఉంటోంది. లేదంటే అధికారులు స్థలం యజమానికి నోటీసులు ఇచ్చి శుభ్రం చేయించాలి. కానీ జిల్లా పరిధిలోని జీహెచ్ఎంసీ సర్కిళ్లతోసహా 13 పురపాలికలలోని పలు కాలనీల్లో ఖాళీ ప్లాట్లు అపరిశుభ్రతకు నిలయంగా నిలుస్తున్నాయి. భావి అవసరాల దృష్ట్యా కొందరు ఇళ్ల స్థలాలను కొని వదిలేస్తున్నారు. ఆయా కాలనీల్లో గృహ నిర్మాణాలు ఊపందుకుని, ప్లాట్లకు విలువ పెరిగిన తర్వాత చూద్దాంలే అనుకొని ఏళ్ల తరబడి వదిలేయడంతో చెత్త, ముళ్లకంప చెట్లు పెరిగి దోమలకు నిలయాలవుతున్నాయి. జిల్లాలో ఉప్పల్, మల్కాజిగిరి, అల్వాల్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిళ్లతోపాటు జవహర్‌నగర్, బోడుప్పల్ ,పీర్జాదిగూడ, పోచారం, ఘట్కేసర్, నాగారం, దమ్మాయిగూడ, గుండ్లపోచంపల్లి, తూముకుంట పురపాలక సంఘాల్లో ఇటీవల కురిసిన వర్షాలతో కాలనీలు ,లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు నిలిచి దోమలు పెరగడంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ,వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

రిజిస్ట్రేషన్‌తో సరి..

ప్లాట్లు ఖరీదు చేసేవారు రిజిస్ట్రేషన్ తర్వాత పురపాలికల్లో తమ పేరిట ఆస్తి మార్పిడి చేయించుకోవాలి. దీని వల్ల డబుల్ రిజిస్ట్రేషన్ ప్రమాదాన్ని నివారించవచ్చు. ఆస్తి మార్పిడితో సదరు స్థలం ఆస్తి పన్ను పరిధిలోకి వస్తోంది. దీన్ని తప్పించుకునేందుకు మ్యుటేషన్‌కు దూరంగా ఉంటున్నారని అధికారులు అంటున్నారు. ఖాళీ స్థలాల మ్యుటేషన్, అసెస్‌మెంట్‌పై దృష్టిసారిస్తే, ఖాళీ స్థలాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారికి నోటీసులు జారీ చేయవచ్చు. నోటీసుకు స్పందించని చోట, పురపాలిక ఆధ్వర్యంలో శుభ్రపర్చి సదరు ఖర్చులను వసూలు చేసే అవకాశం ఉంది. అప్పటికీ స్పందించని పక్షంలో స్వాధీనం చేసుకుని, రుసుం చెల్లించేదాకా నిర్మాణ అనుమతులను నిరాకరించవచ్చు. నిబంధనల అమలుపై పురపాలక సంఘాల అధికారులు దృష్టి పెట్టాల్సిఉంది.

ప్రభుత్వ స్థలాల్లోనూ ఇదే పరిస్థితి..

ప్రైవేటు ప్లాట్ల సంగతి ఇలా ఉంటే ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, అంతర్గత, ప్రధాన రహదారుల వెంట ఉన్న గ్రీన్ బెల్టు తదితర స్థలాలు చెత్తకుండీలుగా మురుగునీటి నిలయాలుగా మారుతున్నాయి. పందులు, కుక్కలకు ఈ ప్రాంతాలు ఆవాసాలుగా మారుతున్నాయి. నిర్మాణ వ్యర్థాలను, భోజన, ప్లాస్టిక్ వ్యర్థాలను ఈ దారిలో పడేస్తున్నారు. ప్రతి ఏటా పట్టణ ప్రగతి, ఇతర ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు సందర్భంగా వీటిని శుభ్రం చేసేందుకు రూ. లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది.